## క్లుప్తంగా

### 'అక్రమ ఇంటి నెంబర్లను తొలగిస్తున్నాం'

**ఆర్మూర్‌టౌన్:** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో అక్రమంగా ఇంటి నెంబర్లు ఇచ్చారని చాలా ఫిర్యాదులు వచ్చాయని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. దీంతో మూడు నెలల నుంచి క్షేత్రస్థాయిలో విచారణ చేసి 30 ఇంటి నెంబర్లు రద్దు చేశామన్నారు. ఇంకా 150 ఇంటి నెంబర్లను గుర్తించామని వాటిని కూడా అదనపు కలెక్టర్ అనుమతి తీసుకొని రద్దు చేస్తామని పేర్కొన్నారు. అక్రమంగా నిర్మించిన 5 భవనాలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నోటీసులు జారీ చేశారని, ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

### విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

**పెర్కిట్(ఆర్మూర్):** ఆర్మూర్ మండలం పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం టై, బెల్టులను అందజేశారు. పాఠశాల పీఈటీ ఎస్ గంగారెడ్డి తన సొంత ఖర్చులతో విద్యార్థులను టై, బెల్టులను వితరణ చేశారు. హెచ్‌ఎం విశ్వనాథ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిఒక్కరు మొక్కలు నాటాలి

**ఆర్మూర్‌టౌన్:** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానంద్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఆర్టీవో కార్యాలయంలో శుక్రవారం సామాజిక సేవకుడు పట్వారీ తులసి మర్యాదపూర్వకంగా కలిసి పర్యావరణ పరిరక్షణలో భాగంగా వివేకానంద్ రెడ్డికి మొక్కను అందజేశారు. కార్యక్రమంలో విద్య గోపికృష్ణ, జర్నలిస్ట్ కాలనీ అధ్యక్షులు సుంకే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతల స్వీకరణ

**ఆర్మూర్‌టౌన్:** ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న రవికుమార్ పదోన్నతిపై ఆర్మూర్ డిపోకు వచ్చారు.

### మున్సిపల్ కమిషనర్‌గా..

**బోధన్‌టౌన్(బోధన్):** బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.శంకర్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. మున్సిపల్ మేనేజర్ నరేందర్‌తో పాటు ఇతర అధికారులు కమిషనర్‌కు స్వాగతం పలికారు. ప్రస్తుతం కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకట నారాయణ సెలవుపై వెళ్లడంతో శంకర్‌కు ఎఫ్ఏసీ బాధ్యతలను అప్పగించారు.

### ఏజీపీగా బొగ్గుల రవీందర్..

**బోధన్:** బోధన్ సీనియర్, జూనియర్ సివిల్ కోర్టు నూతన ఏజీపీగా సీనియర్ న్యాయవాది బొగ్గుల రవీందర్‌ను నియమిస్తూ ఇటీవల జిల్లా కలెక్టర్ హనుమంతు ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణ కేంద్రంలోని రాకాసీపేట్ ప్రాంతానికి చెందిన సీనియర్ న్యాయవాది రవీందర్ 1992 నుంచి న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.

### నలుగురు జీపీ కార్యదర్శుల బదిలీ

**డొంకేశ్వర్(ఆర్మూర్):** మండలంలోని నలుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. ఇందులో నూత్‌పల్లికి చెందిన రాజు, నికాల్‌పూర్‌కు చెందిన రాము, సిర్పూర్‌కు చెందిన విఘ్నేశ్, దత్తాపూర్‌కు చెందిన సుప్రియ ఉన్నారు. వీరి స్థానాల్లో త్వరలో కొత్త పంచాయతీ కార్యదర్శులు రానున్నారు.

### 23 వాహనాల సీజ్

**నవీపేట:** మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ చౌక్ సమీపంలో శుక్రవారం ఆర్‌టీఏ, నవీపేట పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు చూపించని 23 వాహనాలను సీజ్ చేశారు. వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని ఈ సందర్భంగా పోలీసులు సూచించారు. ఆర్‌టీఏ ఎంవీఐలు కిరణ్‌కుమార్, దూప్‌సింగ్, నవీపేట ఎస్సై యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాల బస్సు ..

**బాల్కొండ:** మెండోరా మండలం బుస్సాపూర్‌లోని పవన్ పాఠశాల యాజమాన్యం గాయత్రి కళాశాల పేరుతో బస్సును నడపడంతో బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ద్యాగ శేఖర్ ఫిర్యాదు చేశారు. ఆర్మూర్ ఎంవీఐ వివేకానంద రెడ్డి వెంటనే స్పందించి బస్సును సీజ్ చేశారు. ఫిట్‌నెస్ లేకుండా, ఇతర యాజమాన్యాల పేరుతో బస్సులను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### రూ.4 వేల భృతి చెల్లించాలి



**కమ్మర్‌పల్లి:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం బీడీ కార్మికులకు ఆంక్షలు లేకుండా రూ.4,016 జీవన భృతి వెంటనే చెల్లించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నేత వి. ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. నాయకులు సత్తెక్క, దేవరాం, సారా సురేష్, అశోక్, కిషన్ పాల్గొన్నారు.

# తీరని గదుల కొరత..

- మనఊరు–మనబడిలో రామన్నపేట్ హైస్కూల్‌కు రూ.75 లక్షల నిధులు
- నిర్మాణానికి సరిపోవని ముందుకు రాని కాంట్రాక్టర్లు



పెచ్చులూడిన ఆరో తరగతి గది



రామన్నపేట్‌లో శిథిలావస్థకు చేరిన తరగతి గదులు

**వేల్పూర్:** మండలంలోని రామన్నపేట్ ఉన్నత పాఠశాలలో గదుల కొరతతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. 170 మంది విద్యార్థులు ఈ స్కూలులో చదువుతున్నారు. ఆరు నుంచి పదోతరగతి వరకు బోధించడానికి 5 గదులు అవసరం కాగా, 4 గదులు మాత్రమే బాగున్నాయి. పెచ్చులూడిన మరో గదిని ఉపయోగించుకొని బోధన కొనసాగిస్తున్నారు. మరో రెండు గదులు కొంచెం బాగుండగా ఒకటి హెచ్‌ఎంకు, మరొకటి ఉపాధ్యాయులకు కేటాయించారు. ఆరు గదులు శిథిలావస్థకు చేరగా అందులో కొంచెం బాగున్న గదిని వాడుకొని తరగతులు నడిపిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన ఆరు గదుల స్థానంలో 5 కొత్త గదులు నిర్మించడానికి గత ప్రభుత్వ హయాంలో మనఊరు–మనబడి పథకం కింద రూ. 75 లక్షలు మంజూరయ్యాయి. గదుల నిర్మాణానికి అధికారులు రెండు సార్లు టెండర్లు నిర్వహించారు. రోజు రోజుకు పెరుగుతున్న నిర్మాణ ఖర్చులతో సివిల్ పనికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోవని కాంట్రాక్టర్లు ముందుకు లేదు. ఎన్నికలు రావడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గదుల నిర్మాణం జరుగలేదు. సమస్య తిరిగి మొదటికి వచ్చింది. ఇక్కడ విద్యార్థులకు బోధనతో పాటు సైన్స్‌రూం, గ్రంథాలయం, స్పోర్ట్స్, కంప్యూటర్ బోధనకు కనీసం ఐదు నూతన గదులు అవసరం. ఉన్న గదులను అతికష్టం మీద వాడుకొని పాఠశాలను నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులకు తరగతి బోధన తప్ప, సైన్స్ ప్రయోగాలు, కంప్యూటర్ విద్యాబోధన అందడం లేదు. ఇటీవల ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కింద రూ. 1.50 లక్షలు కేటాయించగా, మౌలిక సౌకర్యాలైన తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్ నిర్మాణం చేపట్టారు. వీటితో పాటు కచ్చితంగా అవసరమైన ఐదు గదుల నిర్మాణానికి సరిపడే నిధులను కొత్త ప్రభుత్వం మంజూరు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

#### నూతన గదులు నిర్మించాలి



స్కూలులో 170 మంది విద్యార్థులం చదువుతున్నాం. తరగతులకు సరిపడ గదులు లేవు. చాలా కష్టంగా ఉంది. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల కంటే ఎక్కువ నిధులు కేటాయించి అవసరమైన గదులు నిర్మించాలి – ప్రిన్సి, పదోతరగతి

#### గదుల కొరతతో ప్రయోగాలు లేవు



హైస్కూలు స్థాయిలో విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు బోధించాల్సి ఉంటుంది. ప్రయోగాలు చేయడానికి అవసరమైన పరికరాలు, కంప్యూటర్లు ఉన్నా నేర్చుకోలేని పరిస్థితి నెలకొంది. లైబ్రరీ కూడా లేదు. ప్రభుత్వం గదుల కొరత తీర్చాలి. – నవీన్, పదోతరగతి

## 'ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత మీదే'

- అధికారులకు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హెచ్చరిక

**రెంజల్(బోధన్):** సర్వే నంబరు–340లోని ఖరీదైన ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత అధికారులు చూసుకోవాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనాన్ని స్థానిక నాయకులు ఆయన దృష్టికి తీసుకవెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే, రెవెన్యూ అధికారులను పిలిపించుకుని తీవ్రస్థాయిలో మందలించారు. పత్రికలో వచ్చే వరకు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసే వారిని గుర్తించి రెవెన్యూ యాక్టు ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఎమ్మార్వై రవిని తీవ్రస్థాయిలో మందలించి..తీరు మార్చుకోకుంటే ఇంటికి పంపిస్తానని హెచ్చరించారు. కార్యాలయానికి వచ్చే లబ్ధిదారులకు పెడుతున్న ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయని, వీరన్నగుట్టకు చెందిన ఓ కేసు వివరాల్లో ఎమ్మార్వై చేసిన తప్పిదం వల్ల నిరుద్యోగికి అన్యాయం జరిగిందని, దీనికి బాధ్యత తీసుకుంటావా అని నిలదీశారు.

## అంక్సాపూర్ హైస్కూలు తనిఖీ



**వేల్పూర్:** అంక్సాపూర్ హైస్కూలును జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నారు.. ఎంతమంది హాజరయ్యారు.. మధ్యాహ్న భోజనం ఎలా ఉంది, తదితర విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం వండేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాత్రలు చాలా బాగా శుభ్రం చేయించాలన్నారు. లేకుంటే భోజనం కలుషితమై విద్యార్థులకు అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు.

## 'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం'



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ఆర్మూర్:** సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, టీజీ ఎండీఎస్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. చైర్మన్‌లుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొట్టమొదటిసారిగా ఆర్మూర్‌కు వచ్చిన వీరిద్దరూ ఆర్మూర్ పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి, మాజీ మంత్రి అర్గుల్ రాజారాం విగ్రహానికి శుక్రవారం పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లా సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గోర్తె రాజేందర్, కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి వినయ్‌రెడ్డి, యాల్ల సాయిరెడ్డి, మారుతిరెడ్డి తదితరులున్నారు.

## నాణ్యమైన చేప విత్తనాలివ్వాలి



**రుద్రూర్:** మత్స్యకారులకు నాణ్యమైన చేప విత్తనాలు అందించాలని కోరుతూ శుక్రవారం కోటగిరి తహసీల్దార్ సునీతకు స్థానిక గంగపుత్రులు వినతి పత్రం అందించారు. వంద శాతం సబ్సిడీపై నాసిరకం చేప విత్తనాలు ఇవ్వడం వల్ల నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

## మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

**బోధన్‌టౌన్(బోధన్):** మొక్కలు నాటి వాటిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని లయన్స్ క్లబ్ ఆఫ్ అపెక్స్ వైటల్ ప్రతినిధి పావులూరి వెంకటేశ్వర్ రావ్ అన్నారు. శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని తట్టికోట్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు లంక జెరూష, సెక్రటరీ అనీల్, జోన్ చైర్మన్ లంక రవి, తదితరులు పాల్గొన్నారు.

**చిట్టాపూర్‌లో వన మహోత్సవం**

**బాల్కొండ:** చిట్టాపూర్‌లో శుక్రవారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈత మొక్కలను నాటారు. గీతాకార్మికుల ఉపాధి కల్పన కోసం ప్రభుత్వం ఈత మొక్కలను ఉచితంగా సరఫరా చేస్తోందని మండల ప్రత్యేకాధికారి రసూల్‌బీ అన్నారు. ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ స్టీఫెన్, ఏపీవో ఇందిర పాల్గొన్నారు.

**నందిపేట (ఆర్మూర్):** నందిపేట మండల కేంద్రంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గౌడ కులస్తులతో కలిసి ఈత మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ తివారి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దిలీప్, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**పర్యావరణ రక్షణకు మొక్కలు నాటాలి**

**బోధన్:** ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తప్పనిసరిగా మొక్కలు నాటాలని వాస్లవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు సూచించారు. శుక్రవారం సాలూర అంతర్రాష్ట్ర ఆర్టీవో చెక్‌పోస్టు ఆవరణలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

## కౌమారదశలో మార్పులపై అవగాహన



**వేల్పూర్:** రామన్నపేట్ హైస్కూలులో 8, 9, 10 తరగతుల విద్యార్థినులకు కౌమారదశలో వచ్చే మార్పులపై వర్డ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ మానిటరింగ్ కో–ఆర్డినేటర్ ఎస్.రాజు, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ లావణ్య విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

## ' ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

**ఆర్మూర్:** పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కనక మహాలక్ష్మి విద్యార్థులతో దురుసుగా ప్రవర్తిస్తున్నందున ఆమెపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. కళాశాలను శుక్రవారం పీడీఎస్‌యూ నాయకులు సందర్శించారు. విద్యార్థులు తమకు నచ్చిన కోర్సులను ఎంచుకొనే విషయంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కలగజేసుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొంటూ తల్లిదండ్రులతో కలిసి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తో మాట్లాడే ప్రయత్నం నాయకులు చేశారు. జోక్యం చేసుకుంటే ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా ప్రధాన కార్యదర్శి నిఖిల్, నేతలు మమత, సిద్ధార్థ, తదితరులున్నారు.

## చంద్రశేఖర్ మరణం తీరని లోటు

**రెంజల్(బోధన్):** పీడిత ప్రజల కోసం ఉద్యమాలు చేసిన రాయల చంద్రశేఖర్ మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా మాస్‌లైన్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం బోర్గాంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్, మండల ప్రతినిధులు పుట్టి నాగన్న, పార్వతి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## యూరియాను మోతాదుకు మించి వాడొద్దు



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అధికారి వాజిద్ హుస్సేన్

**బాల్కొండ:** పంట పొలాల్లో యూరియాను మోతాదుకు మించి వాడొద్దని జిలా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం ముప్కాల్ మండల పరిధిలో పలు సహకార సంఘాల గోదాముల్లో ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులను పాస్ మిషన్ ద్వారానే విక్రయించాలన్నారు. రైతులు యూరియా కొరత ఉంటుందని ఆందోళనతో ఎక్కువ మొత్తంలో నిల్వ చేసుకోవడం సరికాదన్నారు. యూరియాను అధికంగా వినియోగించడం వల్ల చీడ పీడలు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. కృత్రిమ కొరతను సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముప్కాల్ వ్యవసాయ అధికారి రాజుకుమార్, సిబ్బంది ఉన్నారు.

## డ్రగ్స్‌కు అలవాటుపడొద్దు



**మాక్లూర్:** డ్రగ్స్‌కు అలవాటుపడి జీవితాన్ని కోల్పోవద్దని ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని దాస్‌నగర్‌వద్దగల విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో మాక్లూర్ ఎస్సై సుధీర్‌రావు అధ్యక్షతన డ్రగ్స్‌పై జరిగిన అవగాహన సదస్సుకు ఏసీపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణాల్లో డ్రగ్స్ విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయని అంతటితో ఆగకుండా కళాశాలలు లక్ష్యంగా చేసుకుని విద్యార్థులకు డ్రగ్స్ అలవాటు చేస్తున్నారన్నారు. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాశాలలో కొత్త వ్యక్తులు కనిపించిన వెంటనే ప్రిన్సిపల్‌కు తెలియపర్చాలన్నారు. నార్కోటిక్ ఏసీపీ సోమనాథం మాట్లాడుతూ.. హ్యూమన్ ట్రాఫికింగ్‌పైన చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. మత్తు ఇచ్చి విదేశాలకు తరలిస్తున్నారన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. సైబర్ క్రైం ఎస్సై పూర్ణేశ్వర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలి



వినతి పత్రం అందిస్తున్న సాయిలు సుభాష్

**బోధన్:** అమ్దాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ నూతన తరగతి గదుల నిర్మాణ పనులు వెంటనే చేపట్టి విద్యార్థుల ఇబ్బందులను పరిష్కరించాలని శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌ను సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ బోధన్ నియోజకవర్గ చైర్మన్ సాయిలు సుభాష్ కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందించారు. 2021–22 ఏడాదిలో పాఠశాలకు మన ఊరు –మన బడి కార్యక్రమం కింద తొలి దఫాలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరయ్యాయని సాయిలు సుభాష్ తెలిపారు. అదనపు తరగతిగదుల నిర్మాణం కోసం నాలుగు పాత గదులను తొలగించారని, ఆ స్థలంలో నూతన తరగతి గదుల నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదని వివరించారు.

### మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

**ఆర్మూర్‌టౌన్:** పట్టణంలో దోమల బెడద తీవ్రంగా ఉందని ఆరోపిస్తూ ఆర్మూర్ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ.. పట్టణంలో దోమ కాటు వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారన్నారు. వాతావరణంలో మార్పు వల్ల సీజనల్ వ్యాధులు వ్యాప్తిస్తున్నాయని అన్నాన్నారు. నీటి నిల్వలు ఉన్న చోట దోమల మందు పిచికారి చేయించాలన్నారు. అలాగే ఓపెన్ జిమ్‌ల మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కూతాడు ఎల్లయ్య, మండల నాయకులు తొగటి భూమేశ్వర్, రవి కిషన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

### దొంగకు నాలుగు నెలల జైలు శిక్ష

**రుద్రూర్:** సెల్‌ఫోన్ల దొంగతనం కేసులో వ్యక్తికి నాలుగు నెలలు జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం బోధన్ కోర్టులో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సాయి శివ తీర్పు ఇచ్చారు. రుద్రూర్ ఎస్సై అప్పారావు తెలిపిన వివరాలు.. రుద్రూర్ మండలంలోని సులేమాన్‌ఫారంలో అక్రమ్ మొబైల్ షాపులో 2023, సెప్టెంబర్ 12న కోటగిరి గ్రామానికి చెందిన వడ్డేటి గంగాకృష్ణ (22) దొంతనానికి పాల్పడి 25 సెల్‌ఫోన్‌లను అపహరించాడు. షాప్ యాజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితుడిని పట్టుకుని సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

**పేకాట స్థావరంపై దాడి**

**బోధన్‌రూరల్:** ఊటపల్లి శివారులో టాస్క్‌ఫోర్స్ నిజామాబాద్, బోధన్ రూరల్ పోలీలీసుల ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా.. ఆరుగురు వ్యక్తులు పరారైనట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ.2,780 నగదు, బైకులు, సెల్‌ఫోన్లు సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

## సమాచారం..

**నేడు కరెంట్ సరఫరాలో అంతరాయం**

**బోధన్‌రూరల్:** సబ్ స్టేషన్లలలో మరమ్మతులలో భాగంగా బోధన్, రెంజల్, ఎడపల్లి మండలాల్లోని పలు గ్రామాలకు కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని బోధన్ ట్రాన్స్‌కో ఏడీఈ బెనర్జీ శుక్రవారం తెలిపారు. బోధన్ మండలంలోని పెంటాకలాన్, ఎరాజ్‌పల్లి, పెగడాపల్లి, రెంజల్ మండలంలోని నీల, ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తారు.

**నవీపేట పరిధిలో..**

**నవీపేట:** నవీపేటతో పాటు మండలంలోని ఫకీరాబాద్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా పలు గ్రామాలలో శనివారం కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ సుహాసిని శుక్రవారం తెలిపారు. నవీపేట సబ్ స్టేషన్ పరిధిలోని నవీపేట, అభంగపట్నం, ధర్యాపూర్ తండా, అబ్బాపూర్(ఎం), పోతంగల్, శివతండా, శ్రీరాం తండా, హనుమాన్ ఫారమ్ అలాగే ఫకీరాబాద్ సబ్ స్టేషన్ పరిధిలోని ఫకీరాబాద్, నాగేపూర్, అబ్బాపూర్(బి) తండా, మిట్టాపూర్, కోస్లీ గ్రామాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

**ఆర్మూర్ పరిధిలో..**

**ఆర్మూర్‌టౌన్:** పట్టణంతో పాటు పెర్కిట్, మామిడిపల్లి, చుట్టూ ప్రక్కల గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ డీఈ హరిచంద్ తెలిపారు. ఆర్మూర్‌లోని 132/33 సబ్ స్టేషన్‌లో పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

**నేడు ఊర పండుగ**

**బోధన్‌టౌన్(బోధన్):** పట్టణంలోని పాత బోధన్‌లో శనివారం ఊర పండుగను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేయనున్నారు.

**అసిస్టెంట్ కుక్, స్వీపర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం**

**కమ్మర్‌పల్లి:** కమ్మర్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో ఆంధ్రయ్య, ప్రత్యేకాధికారిణి గంగామణి శుక్రవారం తెలిపారు. అసిస్టెంట్ కుక్, స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. విద్యార్హత 7వ తరగతి కాగా, అనుభవం సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాలన్నారు. నెలకు రూ. 9750 చెల్లిస్తామన్నారు. ఈనెల 25లోపు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

**ఓపెన్ టెన్త్ స్టడీ సెంటర్ కొనసాగింపు**

**కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఓపెన్ టెన్త్, ఇంటర్ స్టడీ సెంటర్‌ను కొనసాగిస్తున్నట్లు హెచ్‌ఎం సాయన్న శుక్రవారం తెలిపారు. మారుమూల గ్రామాల వయోజనుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరం ఓపెన్ టెన్త్, ఇంటర్ విద్యార్థులకు మెమోలు, టీసీలు సెంటర్‌లో అందుబాటులో ఉన్నాయని ఉత్తీర్ణులు తీసుకెళ్లాలని కోరారు.

**రేపు ఘనంగా గురుపౌర్ణమి మహోత్సవం**

**బోధన్‌రూరల్:** పట్టణంలోని గంజ్‌రోడ్ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి మహోత్సవంను రేపు(ఆదివారం) ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### సీజనల్ వ్యాధులపై అవగాహన

**రుద్రూర్:** మండల కేంద్రంలోని జవహార్‌నగర్ కాలనీలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి అయేషా సిద్దిఖీ ఆధ్వర్యంలో శుక్రవారం కాలనీవాసులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పలువురికి మలేరియా పరీక్షలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్‌లు రవి, సుమతి, హెచ్‌ఈవో రాజేందర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### పోతంగల్ మండల కేంద్రంలో..

**రుద్రూర్:** పోతంగల్ మండల కేంద్రంలో నిర్వహించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కార్యకర్తలు సంగీత, అనిత పాల్గొన్నారు.

### ప్రమాణస్వీకారం

**ఆర్మూర్‌టౌన్:** పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ నూతన అధ్యక్ష, కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా పోల్కం వేణు, కార్యదర్శిగా దాచేపల్లి సంతోష్, కోశాధికారిగా పాంపట్టి అశోక్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ విజయలక్ష్మి, ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ శ్యామ్ కుమార్, ఇండక్షన్ ఆఫీసర్ బసవేశ్వర్ రావ్, తదితరులు పాల్గొన్నారు.

### సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



**పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 – | ట్విస్టర్ (హిందీ) – 11.50, 6.40, 9.30<br>భారతీయుడు-2 (తెలుగు) – 02.45 |
| స్క్రీన్-2 – | కల్కి – 2898 ఏడి (3డీ-తెలుగు) – 11.00, 2.45, 6.30, 10.15 |
| స్క్రీన్-3 – | డార్లింగ్ (తెలుగు) – 11.40, 3.05, 6.25, 9.45 |
| స్క్రీన్-4 – | ది బర్త్‌డే బాయ్ (తెలుగు) – 02.20,<br>క్రైమ్ రీల్ (తెలుగు) – 5.00<br>పేకమేడలు (తెలుగు) – 7.35<br>భారతీయుడు-2 (తెలుగు) – 10.15 |

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంనాథ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776
బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ కృష్ణ : 7997958178
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899